క్లుప్తంగా

ఘనంగా శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం

రోలుగుంట: స్థానిక పాత రామమందిరం వద్ద శ్రీరామనవమి ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ దంపతులు, వైఎస్సార్ సీపీ యువజన మండలశాఖ అధ్యక్షుడు మద్దు శివ, ఉత్సవ కమిటీ మాజీ ఉప సర్పంచ్ మద్దు తాతబాబు, బుచ్చిరాజు, బల్ల త్రినాథ్ తదితరులు దర్శించుకున్నారు.

సత్యవరంలో ఆంజనేయస్వామి తీర్థం


ఆకట్టుకున్న మహిళా కోలాటాలు

మాడుగుల: మండలంలోని సత్యవరంలో బుధవారం ఆంజనేయస్వామి తీర్థం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు.

కనకమహాలక్ష్మికి కుంకుమార్చనలు


అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

కోటవురట్ల: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉగాది పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వి.శంకరం, వి.చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించి పూజా కార్యక్రమాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని, పూజల్లో పాల్గొన్నారు.

ఉత్సవ పల్లకి బహూకరణ


గవరపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి అందించిన పల్లకీతో దాతలు

కోటవురట్ల : స్థానిక గవరపేట వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఉత్సవ పల్లకీని భక్తులు బహూకరించారు. ఆళ్ల త్రినాథ్ జ్ఞాపకార్థం భార్య నూకరత్నం, కుటుంబ సభ్యులు దీన్ని బుధవారం అందజేశారు. ఇక్కడి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏటా వైకుంఠ ఏకాదశి రోజున కల్యాణోత్సవం, రామాలయంలో శ్రీరామనవమి రోజు సీతారామ కల్యాణోత్సవం భారీగా జరుగుతాయి. ఆయా రోజుల్లో ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగిస్తారు. ఈ ఉత్సవాలకు కోసం ఉపయోగపడేలా దీన్ని రూపొందించి, అందించినట్లు దాతలు తెలిపారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీ


విజేతకు బహుమతి అందజేస్తున్న మాజీ సర్పంచ్ శ్రీరామ్మూర్తి

కోటవురట్ల : కె.వెంకటాపురంలో శ్రీ శుభకృత్ నామ సంవత్సరాదిని పురస్కరించుకుని బుధవారం వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన రంగవల్లికల పోటీలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలో తమరాన గాయత్రి ప్రథమ, దేవాడ రమ్య ద్వితీయ, అయినపర్తి భవానీ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైల రమేష్ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతిగా రూ.3 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.2 వేలు, తృతీయ బహుమతిగా రూ.1500 నగదు అందించారు. మాజీ సర్పంచ్ పైల శ్రీరామ్మూర్తి, పార్టీ నాయకులు గొల్లు చిట్టిబాబు, ఎం.సత్యనారాయణమూర్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వేడుకగా ఉగాది

- శోభకృత్ నామ సంవత్సరానికి ఘన స్వాగతం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం


నర్సీపట్నం : ఎమ్మెల్యే గణేష్ దంపతులకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న కౌన్సిలర్లు

నర్సీపట్నం: ఉగాది వేడుకలను నియోజకవర్గంలో ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. శోభకృత్ నామ సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, కౌన్సిలర్లు కోనేటి రామకృష్ణ, దాడి కృష్ణవేణి, మాకిరెడ్డి బుల్లిదొర, వీరమాచినేని జగదీశ్వరి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషాబేగం, కర్రి కనక మహాలక్ష్మి, దుర్గామల్లేశ్వరి స్వామి ఆలయ చైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, కౌన్సిలర్లు ఎమ్మెల్యే పెట్లదంపతలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేసి, ఘనంగా సన్మానించారు.

పట్టణంలో వెలమవీధి రామాలయంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీహెచ్.వరుణ్, లాలం అప్పారావు పాల్గొన్నారు.

నాతవరం: మండలంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాతవరం రామాలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి క్రియేటివ్ హెడ్, వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు పైల పోతురాజు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు ఎంపీటీసీ సభ్యులు కరక రేణుక, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, వర్తక సంఘం సభ్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రావికమతం: ఉగాది పర్వదినం సందర్భంగా గ్రామ గ్రామానా పంచాంగ శ్రవణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రావికమతం శివాలయం, చినపాచిల పెద్దరాయివద్ద, కొత్తకోట శివకేశవ ఆలయం, టి.అర్జాపురం వినాయక ఆలయం, గొంప,మరుపాక, మేడివాడ, దొండపూడి, కన్నంపేట తదితర గ్రామాల్లోని పంచాంగ శ్రవ ణం కార్యక్రమాలను జరిపారు.


నర్సీపట్నం : పంచాంగ శ్రవణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీహెచ్.సన్యాసిపాత్రుడు

రోలుగుంట: స్థానిక పాత రామమందిరం వద్ద పంచాంగశ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తకోట వేపా లక్ష్మీ నారాయణమూర్తి పంతులు శ్రీ శోభకృత నామ సంవత్సర ఫలితా లు వివరించారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మాడుగుల: మండలంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మాడుగుల మండల కేంద్రంలో మోదకొండమ్మ,పార్థసారథి, వేంకటేశ్వర, వేణుగోపాలస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పార్థసారథి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి,ఉపసర్పంచ్ శ్రీనాదు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, షేక్‌ఉన్నీషా, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనువాసరావు తదితరులు తదితరులు పాల్గొన్నారు. కేజే పురం సీతారామస్వామి ఆలయం , జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, వి.వి.అగ్రహారం శివాలయం, ఎం.కోటపాడు, వంటర్లపాలెం, ముకుందపురం రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవరాపల్లి: ఉగాది వేడుకలను మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవరాపల్లి, రైవాడ, ఎ.కొత్తపల్లి, తారువ, మామిడిపల్లి, బోయిలకింతాడ, కొత్తపెంట, కలిగొట్ల, తెనుగుపూడి తదితరగ్రామాల్లో పంచాంగ శ్రవణం చేశారు.


దేవరాపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ భాస్కరరావు.


విఘ్నేశ్వరస్వామిని దర్శించుకుంటున్న విశాఖపట్నం చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ పద్మావతి

దేవరాపల్లి అభివృద్ధికి డిప్యూటీ సీఎం కృషి

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దేవరాపల్లిని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని స్థానిక మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు అన్నారు. దేవరాపల్లి రామాలయంలో ఉగాది వేడుకల అనంతరం గ్రామ పెద్దలతో గ్రామాభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ భాస్కరరావు మాట్లాడుతూ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు రాజకీయాలకు అతీతంగా సహకరించాలన్నారు. దేవరాపల్లి గ్రామ దేవత శ్రీ సన్యాసమ్మ అమ్మవారి నెల రోజు పండుగను జూన్ 6న భారీ స్థాయిలో నిర్వహించేందుకు తీర్మానించారు. డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వరదపురెడ్డి లలితానాయుడు, గండిపడాల అప్పలరాజు, గుండు రాంబాబు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కె.కోటపాడు : ప్రధాన ఆలయాల్లో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొండుపాలెం, రొంగలినాయుడుపాలెం, గుల్లేపల్లి, పాచిలవానిపాలెం, పైడంపేట తదితర గ్రామాల్లో పంచాంగ శ్రవణం, తదితర కార్యక్రమాలు జరిగాయి.


చోడవరంలో స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

చీడికాడ: అప్పలరాజుపురంలో జరిగిన ఉగాది వేడుకల్లో ఎంపీపీ కురసా జయమ్మ, నారాయణమూర్తి దంపతులు, జేడీపురంలో సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు, రాజబాబు దంపతులు, తురువోలులో జెడ్పీటీసీ లాలంశారదాజానకీరామ్‌లుపాల్గొన్నారు.

చోడవరం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులుపెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి ఈ ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి, మహేష్ ప్రత్యేక పూజలు చేశారు. విఘ్నేశ్వరస్వామిని విశాఖపట్నం చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్. పద్మావతి దర్శించుకున్నారు. స్వామివారి సూక్తుల పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామివారి ఆలయం, శ్రీ కేశవస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. నూకాంబిక అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్థానిక ప్రేమసమాజంలో ప్రసన్నభారతి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు సంప్రదాయంగా నిర్వహించారు. బ్రాహ్మణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వేలమూరి రామారావు పంచాంగ శ్రవణం చేశారు. ట్రస్ట్ ప్రతినిధులు కందర్ప రమేష్, మంధా గౌరీశంకర్,గుంటూరుసత్యనారాయణపాల్గొన్నారు.

రావికమతం: ఉగాది సందర్భంగా పలు గ్రామాల్లో కొత్తఏరు నిర్వహించారు.రావికమతం,కొత్తకోట,చినపాచిల,గుడ్డిప,మేడివాడ,బాదనపాడు ,దొండపూడి, టి.అర్జాపురం తదితర గ్రామాల్లో పలువురు రైతులు నాగలికి జోడెడ్లు కట్టి కొత్త ఏరు కార్యక్రమాన్ని జరిపారు.


చోడవరంలో బ్రాహ్మణ సంఘం మండపంలో పంచాంగ పఠనం చేస్తున్న వేలమూరి రామారావు


రావికమతం : చినపాచిలలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు


నాతవరం రామాలయం వద్ద పంచాంగ శ్రవణం


రోలుగుంట : సంవత్సర ఫలితాలు వివరిస్తున్న పురోహితుడు


రావికమతం : సంప్రదాయబద్ధంగా దున్నుతున్న రైతు కొశిరెడ్డి రాజబాబు

పాడిరైతులపై 'లంపీస్కిన్' పడగ

- రెండు మాసాల్లో 50కి పైగా పశువులు మృతి
- వెన్నలపాలెంలో ఇటీవల మృతి చెందిన ఆవు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పాడి రైతులు


వెన్నలపాలెంలో మృతి చెందిన ఆవు వద్ద విచారంగా ఉన్న రైతు పైల పైడన్న

నాతవరం: ఇటీవల కాలంలో లంపీస్కిన్ వ్యాధితో పశువులు మృత్యువాత పడుతుండటంతో రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మర్రిపాలెం పంచాయతీ శివారు వెన్నలపాలెం గ్రామంలో ఇటీవల పైల పైడియ్యకు చెందిన ఆవు ఆకస్మికంగా మరణించింది. దీనికి లంపీస్కిన్ వ్యాధే కారణమని భావిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఇలాంటి సంఘటనలు వరుసగా జరుగుతుండటంతో పాడిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండు మాసాలుగా వరుస మరణాలు

మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో రెండు నెలల వ్యవధిలో లంపీస్కిన్ లక్షణాలతో సుమారు 50కి పైగా ఆవులు, గేదెలు, ఎద్దులు మరణించినట్టు రైతులు చెప్తున్నారు. మర్రిపాలెం పంచాయతీలో మూడు రోజుల వ్యవధిలోనే ఐదు పశువులు మరణించాయి. నాతవరం ఎం.బి.పట్నం, శృంగవరం, రాజుపేట అగ్రహారం, వల్సంపేట, గుమ్మడిగొండ, గునుపూడి, పీకే గూడెం, వెదురుపల్లి, సరుగుడు, బెన్నవరం, మన్యపురట్ల, పెదగొలుగొండపేట గ్రామాల్లో ఇటీవల కాలంలో పలు వ్యాధులతో పశువులు మరణిస్తున్నట్టు రైతులు వాపోతున్నారు. ముందు పశువులకు శరీరమంతా దద్దుర్లు మాదిరిగా వ్యాపించి, గాయం మాదిరి మారుతున్నాయని, క్రమేపీ మేత తినక, నీరసించి చనిపోతున్నట్టు చెప్తున్నారు. జీవనాధారంగా కష్టపడి పెంచుకుంటున్న పశువులు కళ్ల ముందే మృత్యువాత పడుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కానరాని వైద్యులు

మండలంలో నాతవరం, గునుపూడి, శృంగవరం ప్రాంతాల్లో పశు వైద్యశాలలు ఉన్నాయి. గునుపూడిలో పనిచేసే పశువైద్యులు డిప్యుటేషన్‌పై విశాఖలో పని చేస్తున్నారు. నాతవరంలో పని చేసే పశువైద్యాధికారి వంశీకృష్ణయాదవ్ గత ఏడాది బదిలీపై వెళ్లిపోయారు. ఆయన స్థానంలో వేరెవ్వరినీ ఇక్కడ నియమించలేదు. శృంగవరం పశువైద్యాధికారి కూడా చాలా కాలంగా సెలవుపై వెళ్లిపోవడంతో అక్కడా వైద్యులు అందుబాటులో లేరు. దీంతో సమీపంలో ఉన్న మూడు పశువైద్యశాలలూ వైద్యుల్లేక సేవలకు దూరంగా ఉన్నాయి. అత్యవసర సమయంలో ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మొబైల్ వ్యాన్ వస్తోంది. అత్యవసర కేసులు మినహా, సాధారణ సమస్యలకు ఈ సిబ్బంది వైద్య సేవలందించట్లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఆర్‌బీకే కేంద్రాల్లో పనిచేసే వెటర్నరీ సిబ్బంది, గోపాలమిత్రలు అందించే నామ మాత్రపు వైద్య సేవలతోనే పాడి రైతులు కాలం వెళ్లదీస్తున్నారు.

మా దృష్టికి రాలేదు

పశువులు మరణిస్తున్న విషయాన్ని మా దృష్టికి ఎవరూ తీసుకురాలేదు. లంపీ స్కిన్ వ్యాక్సిన్ సిద్ధంగా ఉంది. ఎప్పటి నుంచో వ్యాక్సిన్లు వేస్తున్నాం. రెగ్యులర్ పశువైద్యుల ఖాళీలను కొత్త రిక్రూట్‌మెంటు ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పశువుల ఆరోగ్య సంరక్షణపై తక్షణ చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, అసిస్టెంట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, పాయకరావుపేట

ఘనంగా నూకాలమ్మ పండగ


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రోలుగుంట: మండలకేంద్రం రోలుగుంటలో పప్పల, తమరానవారి కళ్లాల వద్ద నూకాలతల్లి పండగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

దాలిపేటలో..

మాకవరపాలెం: మండలంలోని దాలింపేటలో నూకాంబిక జాతరను ఘనంగా నిర్వహించారు. ఏటా ఉగాది నాడు ఈ జాతరను వైభవంగా నిర్వహిస్తారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కల్యాణ మండప నిర్మాణానికి నిధుల మంజూరు


ఎం. కోడూరులో మాట్లాడుతున్న గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు తదితరులు

మాడుగుల రూరల్: మండలంలోని ఎం.కోడూరులో కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరైనట్టు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయడు చొరవతో రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య తన కోటా పార్లమెంటు నిధుల నుంచి రూ.36 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి గొల్లవిల్లి సంజీవిరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, పాలసొసైటీ అధ్యక్షుడు గొల్లవిల్లి సత్యారావు, నీటి సంఘం అధ్యక్షుడు కలిమి గోసన్న తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు దెబ్బతిన్న అపరాలు


ఒమ్మలిలో పూర్తిగా దెబ్బతిన్న మినప పంట

మాడుగుల రూరల్: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలు రైతులకు నష్టాన్ని మిగిల్చాయి. మినప, పెసర, జనుము, పంటలు తడిసి పనికిరాకుండా పోయాయి. మినప పంట చేతికొచ్చే సమయంలో భారీ వర్షాలు కురవడంతో పూర్తిగా దెబ్బతింది. కె.జె.పురం, వంటర్లపాలెం, మాడుగుల, సత్యవరం, ఒమ్మలి, వీజే పురం, వీరనారాయణం, గాదిరాయి, పొంగలిపాక, సాగరం తదితర గ్రామాలల్లో అపరాలకు త్రీవ నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జనుము పంట నేలకొరిగింది. బుధవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది.

ఈదురుగాలులతో కూలిన చెట్లు

మాకవరపాలెం: మండలంలో బుధవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులకు చంద్రయ్యపాలెం వద్ద విశాఖ–నర్సీపట్నం ప్రధాన రహదారిలో రెండు తాటి చెట్లు రోడ్డుకు అడ్డంగా కూలిపోయాయి. దీంతో సుమారు గంటపాటు ట్రాఫిక్ జామ్ అయింది.

కె.కోటపాడులో

కె.కోటపాడు: మండల వ్యాప్తంగా బుధవారం వర్షం కురిసింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా అపరాల సాగుకు నష్టం కలిగే పరిస్థితి ఉందని రైతులు తెలిపారు.

నానాతవరంలో

నాతవరం: మండలంలో బుధవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. ఉగాది నాడు వర్షం పడితే ఆ ఏడాది పంటలు బాగా పండుతాయని రైతుల నమ్మకం.


వీరనారాయణంలో మినప పంటపై కప్పిన టార్పాలిన్


చంద్రయ్యపాలెం వద్ద రోడ్డుకు అడ్డంగా కూలిన తాటి చెట్టు


గుల్లేపల్లిలో ..


తాండవ జంక్షన్‌లో కురుస్తున్న వర్షం

మరిడిమాంబకు వెండిహారం

- సమర్పించిన ఎంపీపీ రాజేశ్వరి దంపతులు


మరిడిమాంబకు సమర్పించిన వెండి హారం

దేవరాపల్లి: స్థానిక మరిడిమాంబ ఆలయంలో అమ్మవారికి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, భాస్కరరావు దంపతులు వెండి హారాన్ని సమర్పించారు. రూ.87 వేలతో కిలో 13 గ్రాముల వెండితో హారాన్ని తయారు చేయించి శోభకృత్ నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామస్తుల సమక్షంలో బుధవారం అందజేశారు. అమ్మవారికి ఈ వెండి హారాన్ని సమర్పించి తమ మొక్కు చెల్లించుకున్నామని వారు తెలిపారు.

శ్రీమహాలక్ష్మి ఆలయం వద్ద తీర్థ మహోత్సవం

కోటవురట్ల: స్థానిక బీసీ కాలనీలో శ్రీ మహాలక్ష్మి ఆలయం వద్ద బుధవారం తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం భక్తుల తాకిడితో సందడిగా మారింది. సమీప గ్రామాల నుంచి పెద్ద పెద్ద సంఖ్యలో తరలివచ్చిన జనం తీర్థంలో సందడి చేశారు. అమ్మవారికి అరటి గెలలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


దేవీపురంలో పూజలు అందుకున్న లలితాంబిక

సబ్బవరం : ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరి దేవి క్షేత్రంలో లలితాంబికా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ యంత్ర మహామేరు ఆలయం ముందు గోపూజతో ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం శ్రీమేరు మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన కలశాలను వేదమంత్రాల సహితంగా ప్రాణ ప్రతిష్ఠ గావించిన లలితాంబికా అమ్మవారిని భక్తులు తోడ్కొనివచ్చి నవయోని రేఖచిత్రం మధ్యలో ఆశీనులను చేశారు. అనంతరం అమ్మవారికి క్షీరాభిషేకం , ఖడ్గమాల, సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. గణపతి సహిత బాల హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్ట్రేలియా నుంచి వచ్చిన ప్రేమ్ చందు మీనన్, పూణే నుంచి వచ్చిన పూనం ప్రధాన్, ముంబై నుంచి వచ్చిన అర్చన ఆర్యతోపాటు భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా ముసిలితల్లి అమ్మవారి సారె ఊరేగింపు

మునగపాక : అరబుపాలెంలో బుధవారం ముసిలితల్లి అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో సారె ఊరేగింపుతో బయలుదేరారు. డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. మహిళలు తయారు చేసిన పలు రకాల పండి వంటలు అందరినీ ఆకట్టుకున్నాయి. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు,ఆలయ చైర్మన్ కొయిలాడ గంగాధర్, కార్యదర్శి లక్ష్మణరావుపాల్గొన్నారు.